06ATP27_06ATP27.qxd 30-06-2023 PM 11:07 Page 1



## రైతులను నిరాశ పరచిన పంటలభీమా

**- మండలానికి రూ. 7,57,25,654లు విడుదల - వేరుశనగకు శూన్యం**

**బత్తలపల్లి, జూన్ 30 ప్రభాతవార్త :** మండలంలో 202ఖరీఫ్ సీజనులో పంటలు సాగు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలభీమా నిరాశపరిచిందని పలువురు రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మండలంలో 8860.51ఎకరాలకు రూ. 7,57, 25,654లు పంటల భీమాను ప్రకటించినట్లు ఏఓ ఓబిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ భీమాలో బత్తాయికి ఎకరాకు రూ. 11,570లు, మొక్కజొన్నకు ఎకరాకు రూ. 4758లు, కంది పంటకు ఈదుల ముష్టూరు రెవెన్యూ గ్రామానికి ఎకరాకు రూ. 6796లు మాల్యవంతం రెవెన్యూ గ్రామానికి రూ. 4433లు, బత్తలపల్లికి రూ. 144లు చొప్పున మంజూరు చేసిందన్నారు. అయితే రైతులు ఎక్కువగా సాగుచేసిన వేరుశనగ పంటకు మాత్రం రూపాయి కూడా కేటాయించకపోవడం పట్ల రైతులు తీవ్ర నిరాశలో వున్నారు. పంటల భీమా కేటాయించిన రైతులు తమ పంచాయితీ పరిధిలోని ఆర్బీకేలలోని నోటీసు బోర్డులో తమ పేర్లు చూసుకోవాలని ఏఓ సూచించారు. ఈ పంటల భీమాలో ఎవైనా అభ్యంతరాలుంటే ఆర్బీకేలలో తెలపవలెనన్నారు.

## 'జగనన్న సురక్ష' పథకంను విజయవంతం చేద్దాం

**- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమీషనర్**


మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

**ధర్మవరం టౌన్, జూలై 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన వార్డు సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పథకం వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 1 నుండి ప్రారంభం కానున్న ఈ పథకంలో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లక్ష్యసాధన దిశగా ప్రజా ప్రతినిధులు అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొని పనిచేయాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రజలకు వంద శాతం సంక్షేమపథకాలను అందించడమే లక్ష్యంగా ఈ పథకం అమలుచేయాలన్నారు. ప్రస్తుతం ఇ-సేవ కార్యాలయం ఉన్న చోట త్వరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సూపర్ బజార్ లాంటి దుకాణాన్ని నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల్లో ఇండ్లు కట్టుకోకపోతే వాటి పట్టాలను రద్దుచేసి లేనివారికి తిరిగి మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఈ విషయం ప్రజల దృష్టికి తీసుకుపోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉందని తక్షణం పరిష్కరించాలని కోరారు. పట్టణ శివారు ప్రాంతాల్లో నూతనంగా పైపులైన్లను వేశారని అయితే ఇప్పటివరకూ కనెక్షన్లు ఇవ్వలేదని వారు సభ దృష్టికి తెచ్చారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని వారు కోరారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లేకపోవడంతో పలువురు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నారని, తక్షణం మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అంతకుముందు 71 అంశాలతో కూడిన అజండాను ఆమోదించారు. పట్టణంలో చేపట్టాల్సిన అనేక అభివృద్ధి పనులతో పాటు మంజూరైన పలు అభివృద్ధి పనులకు ఖారారైన కాంట్రాక్టర్ల ప్రక్రియను ఆమోదం తెలిపారు. దీంతో పాటు వైస్ చైర్‌పర్సన్ 1 వై.భాగ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ 2 నాగరాజుల రాజీనామాలను కౌన్సిల్ ఆమోదించింది. తొలుత బదిలీపై వచ్చిన మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను కమీషనర్ శేషన్న సభ్యులకు పరిచయం చేశారు. కాగా తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ లింగం నిర్మల సమావేశం మధ్యలో వచ్చి సంతకం చేసి వెంటనే వెళ్ళిపోవడం ఇక్కడ కొసమెరుపు.

## ఆర్బీకేల్లో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల భీమా అర్హుల జాబితా

**-వ్యవసాయశాఖ ఉరవకొండ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మజ**


విలేఖరులతో మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బామా పథకం కింద ఖరీఫ్ 2022కు సంబంధించి వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారిత తాత్కాలిక అర్హుల జాబితా రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం జూలై 3వ తేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందని ఉరవకొండ ఏడీఏ పద్మజ తెలిపారు. శుక్రవారం ఏడీఏ విలేఖరులతో మాట్లాడుతూ సామాజిక తనిఖీలో వచ్చిన పిర్యాదులు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటిని ఆన్‌లైన్‌లో 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద ఉరవకొండ డివిజన్‌లో వేరుశెనగ, బత్తాయి, టమోటా పంటలకు బీమా వచ్చిందన్నారు. వాతావరణ ఆధారిత బీమా రావడానికి వర్షపాత, గాలిలోతేమ, ఉష్ణోగ్రత తదితర అంశాలను పరిగణిలోకి తీసుకొని లెక్కించడం జరిగిందన్నారు. ఉరవకొండ డివిజన్‌లో గల 4 మండలాలు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో వేరుశెనగ, బత్తాయి, టమోటా పంటలకుగాను 9,398 మంది రైతులకు 6.31 కోట్ల రూపాయలు బీమా వచ్చిందన్నారు. దిగుబడి ఆధారిత బీమా కింద పత్తి పంటకు ఉరవకొండ డివిజన్‌లోని 4 మండలాల్లో బీమా 4.14 కోటు రూపాయలు 4,363 మంది రైతులకు వచ్చిందన్నారు. పత్తి వర్షాధారం కింద సాగైన పంటకు గ్రామం యూనిట్‌గా పరిగణిలోకి తీసుకొని బీమా లెక్కించడం జరిగిందని వివరించారు.

## నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం పూర్తి కావాలి

**-జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ**


రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, చందా చంద్రమ్మ

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** నాణ్యత ప్రమాణాలను అనుగుణంగా సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు గుత్తేదార్లకు సూచించారు. ఉరవకొండ పట్టణంలో 25 లక్షల రూపాయల జెడ్పీటీసీ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బి.తేజోనాథ్, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, పెన్నహోబిళం దేవ స్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తిఅయి ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో పట్టణంలో 7 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంగదాల అంజి, ఉలిగప్ప, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక సమావేశం

**అమరాపురం, జూన్ 30, ప్రభాతవార్త:** మండలపరిధిలో ఆలదపల్లి, వి.ఆగ్రహారం గ్రామాలలో సచివాలయాల నందు శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మెరకు జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మునిస్వామి తెలిపారు. ఈ సమావేశం ద్వారా అర్హత కలిగిన అబ్దిదారులకు సర్టిఫికెట్లను మంజూరుచేయడం జరుగుతుందని ఈ కార్యక్ర మానికి స్థానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## విద్యుత్ ఏఈఈ కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఐ, సీపీఎం పార్టీలు..!

**-అధికారులు, సిబ్బందిని బయటకు పంపి కార్యాలయం మూసివేత**

**-వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్**


విద్యుత్ ఏఈఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** పట్టణంలోని విద్యుత్ ఏఈఈ కార్యాలయాన్ని వామపక్ష సీపీఐ, సీపీఎం పార్టీలు శుక్రవారం ముట్టడించాయి. కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిను బయటకు పంపి కార్యాలయం మూసి వేసి అక్కడే బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కేశవరెడ్డి, తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శులు మల్లికార్జున, సుల్తాన్, సీపీఎం జిల్లా కమిటీ కమిటీ సభ్యుడు రంగారెడ్డి, నాయకులు జ్ఞానమూర్తి, శీనప్ప, సిద్దప్ప తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు విద్యుత్ బిల్లులు చూడగానే షాక్ కొట్టే పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం ప్రజల కళ్ళు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు చార్జీల భారం వేస్తోందని ఆ విధానాన్ని రద్దుచేసి ట్రూ అప్, సర్దుబాటు చార్జీల వసూళ్ల నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లను పెట్టడానికి వీలులేదని తేల్చి చెప్పారు. మాట తప్పిన జగన్ ప్రభుత్వం సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతోందని మండిపడ్డారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లొంగి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణ పేరుతో చార్జీలు పెంచితే జనం తిరగబడ్డారని నేడు జగన్ అదేబాటలో నడుస్తున్నారని మళ్లీ తిరుగుబాటు తప్పదన్నారు. కార్పొరేట్ల దోపిడీ, ప్రభుత్వాల అవినీతిని అరికడితే కరెంటు చార్జీలు పెంచకుండా తగ్గించవచ్చున్నారు. చార్జీల భారం తగ్గేంతవరకు దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆందోళన అనంతరం ఏఈఈ గురుమూర్తికు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, సీపీఎం నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏఎస్ఐలు శ్రీశైలం, పాల్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


విద్యుత్ ఏఈఈ గురుమూర్తికు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## లక్ష్మినరసింహ కాలనీలో డ్రైవర్ ఇంట్లో చోరి..!

**- రూ.3 లక్షల నగదు, 2 తులాల బంగారం అపహరణ**


దొంగలు ఇంట్లోని బీరువాను తెరచి చిందరవందర చేసిన దృశ్యం


వివరాలు వెల్లడిస్తున్న మహబూబ్‌బాషా

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** పట్టణంలోని లక్ష్మినరసింహ కాలనీలో (వాణి విద్యా నికేతన్ ప్రాంతం) ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ మహబూబ్‌బాషా ఇంట్లో దొంగలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి తాళాన్ని బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాను తెరిచి అందులోని 3 లక్షల రూపాయల నగదుతోపాటు 2 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. డ్రైవర్ మహబూబ్‌బాషా బక్రీద్ పండుగను కుటుంబంతో జరుపుకోవాలని ఇంటికి తాళంవేసి సొంతూరు పామిడిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లగా గమనించిన దొంగలు చోరికు పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితుడైన డ్రైవర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం తెలిసిన వారి నుండి 3 లక్షల రూపాయలు వడ్డీకు అప్పు తెచ్చుకున్నానని దొంగలు ఆ మొత్తాన్ని ఎత్తుకెళ్లిపోయారని ఇక ఇంటి నిర్మాణం ఎలా పూర్తి చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలియగానే ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బందితో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. స్కూల్, చుట్టుప్రక్కల ఎవరి ఇళ్లకైనా సీసీ కెమెరాలు ఉన్నాయేమోనని పరిశీలించి అందులో నమోదైన ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు యత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న క్లూస్ టీం జిల్లా కేంద్రం నుండి చోరీ జరిగిన ఇంటికి చేరుకొని ఆధారాలు సేకరించింది.


చోరి జరిగిన ఇంటివద్ద ఘటనపై ఆరా తీస్తున్న ఎస్ఐ టి.పి.వెంకటస్వామి

## దుర్గాభవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

**-ఆషాడ శుక్రవారం కావడంతో కొనసాగిన భక్తుల రద్దీ**


ప్రత్యేక అలంకరణలో దుర్గాభవాని అమ్మవారు

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానిక వైకేపీ కార్యాలయం పక్కనగల దుర్గాభవాని ఆలయంలో స్వస్తిశ్రీ ఆషాడ శుద్ధ ద్వాదశి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రాతఃకాలంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చన మహా మంగళ హారతి కార్యాక్రమాలు కొనసాగాయి. అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకోగా ఆలయ కమిటీ వారికి తీర్థ ప్రసాదాలు అందించింది.

## శ్రీభూమానంద ఆశ్రమం 10వ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయండి


శ్రీశ్రీశ్రీ ధనుంజయ స్వామిజీ

**మడకశిర జూన్ 30 ప్రభాతవార్త;** పట్టణ పరిధిలోని పెనుకొండరోడ్డులోని శ్రీభూమా నంద ఆశ్రమము 10వ వార్షికోత్సవం జులై 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆశ్రమము వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ ధనుంజయస్వామిజీ ఒక ప్రకటనలో తెలియజేశారు. వార్షికోత్సవం రోజున గురుపౌర్ణమి వేడుకలను మరియు శ్రీశ్రీశ్రీ ధనుంజయస్వామిజీ (బ్రహ్మానంద మహర్షి) వారి 68వ జన్మదిన వేడకలను భక్తులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా గురుపూజ, భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వ హించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమా ల అనంతరం అన్నదానం జరుగుతుందని వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈవేడకలను జయప్రదం చేయాలని వారు కోరారు.

# మండలానికి రూ.1.06 కోట్ల పంటల భీమా మంజూరు

**- చీని, పత్తి పంటలు సాగు చేసిన 626 మంది రైతులకు వర్తింపు - వివరాలు వెల్లడించిన మండల వ్యవసాయాధికారి జి.శుభకర్**


వివరాలు వెల్లడిస్తున్న మండల వ్యవసాయాధికారి జి.శుభకర్

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త** 2022 ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా మండలంలోని చీని, పత్తి పంటలు సాగు చేసిన 626 మంది రైతులకు 2,010 ఎకరాలకుగాను 1,06,39,437 రూపాయలు మంజూరు అయిందని మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులకు వివరాలు వెల్లడించారు. చీని రైతులు 251 మందికి 971 ఎకరాలకుగాను 97,16,750 రూపాయలు, పత్తి రైతులు 375 మందికి 1,038 ఎకరాలకుగాను 9,23,287 రూపాయలు మంజూరుకాగా జూలై 8న రైతుల ఖాతాల్లోకి బీమా డబ్బు జమ అవనుంది. పెద్దముష్టూరులో నలుగురు చీని రైతులకు 16.34 ఎకరాలకు 1,63,400 రూపాయలు, 21 మంది పత్తి రైతులకు 54.2 ఎకరాలకు 48,256 రూపాయలు మంజూరైంది. చిన్నముష్టూరులో ఇద్దరు చీని రైతులకు 5.83 ఎకరాలకు 58,300 రూపాయలు మంజూరైంది. ఇంద్రావతిలో ఐదుగురు చీని రైతులకు 14.66 ఎకరాలకు 1,46,600 రూపాయలు, పత్తి రైతు ఒకరికి రెండు ఎకరాలకు 1,776 రూపాయలు, లత్తవరంలో ముగ్గురు చీని రైతులకు 7.28 ఎకరాలకు 72,750 రూపాయలు మంజూరైంది. మోపిడిలో 45 మంది చీని రైతులకు 147.82 ఎకరాలకు 14,78,200 రూపాయలు, ఆమిద్యాలలో 29 మంది చీని రైతులకు 158.1 ఎకరాలకు 15,81,000 రూపాయలు, పత్తి రైతు ఒకరికి 4.57 ఎకరాలకు 4,063 రూపాయలు మంజూరైంది. రాకెట్లలో 28 మంది చీని రైతులకు 128.66 ఎకరాలకు 12,86,600 రూపాయలు, పత్తి రైతులు 15 మందికి 106.61 ఎకరాలకు 94,786 రూపాయలు మంజూరైంది. పెద్దకౌకుంట్లలో 23 మంది చీని రైతులకు 66.62 ఎకరాలకు 6,66,200 రూపాయలు, 33 మంది పత్తి రైతులకు 171.39 ఎకరాలకు 1,52,382 రూపాయలు మంజూరైంది. వై.రాంపురంలో 10 మంది చీని రైతులకు 37.23 ఎకరాలకు 3,72,300 రూపాయలు, ఐదుగురు పత్తి రైతులకు 16 ఎకరాలకు 14,269 రూపాయలు మంజూరైంది. మైలారంపల్లిలో 74 మంది చీని రైతులకు 299 ఎకరాలకు 29,90,000 రూపాయలు, నలుగురు పత్తి రైతులకు 10.8 ఎకరాలకు 9,600 రూపాయలు మంజూరైంది. షేక్షానుపల్లిలో 19 మంది చీని రైతులకు 58.79 ఎకరాలకు 5,87,900 రూపాయలు, 60 మంది పత్తి రైతులకు 149.57 ఎకరాలకు 1,32,972 రూపాయలు మంజూరైంది. ఉరవకొండలో 16 మంది పత్తి రైతులకు 38.32 ఎకరాలకు 34,067 రూపాయలు మంజూరుకాగా, వెలిగొండలో 53 మంది పత్తి రైతులకు 117.85 ఎకరాలకు 1,04,769 రూపాయలు మంజూరైంది. బూదగవిలో నలుగురు చీని రైతులకు 11.75 ఎకరాలకు 1,17,500 రూపాయలు, 130 మంది పత్తి రైతులకు 295.13 ఎకరాలకు 2,62,356 రూపాయలు మంజూరైంది. రేణిమాకుపల్లిలో ముగ్గురు పత్తి రైతులకు 8.4 ఎకరాలకు 7,468 రూపాయలు మంజూరుకాగా నింబగల్లులో ఇద్దరు చీని రైతులకు 9 ఎకరాలకు 90,000 రూపాయలు, ఇద్దరు పత్తి రైతులకు 5.85 ఎకరాలకు 5,200 రూపాయలు మంజూరైంది. నెరమెట్లలో చీని రైతు ఒకరికి 1.18 ఎకరాలకు 11,800 రూపాయలు, 15 మంది పత్తి రైతులకు 26.21 ఎకరాలకు 23,293 రూపాయలు మంజూరైంది. రాయంపల్లిలో ఇద్దరు చీని రైతులకు 9.36 ఎకరాలకు 93,600 రూపాయలు, 14 మంది పత్తి రైతులకు 29.53 ఎకరాలకు 26,252 రూపాయలు, వ్యాసాపురంలో ఇద్దరు పత్తి రైతులకు రెండు ఎకరాలకు 1,778 రూపాయలు మంజూరు అయింది. కాగా కేవలం రెండు పంటలకు మాత్రమే బీమా వర్తించడంపట్ల రైతులు మండిపడుతున్నారు.

## బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల కేంద్రం ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ**


విలేఖరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ

**ఉరవకొండ, జూన్ 30 ప్రభాతవార్త :** డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో 2023-24 సంవత్సరానికి చేరడానికి అభ్యర్థులు జూలై 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల కేంద్రం ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఇంటర్, పాలిటెక్నిక్, 2 సంవత్సరాల ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పూర్తి చేసినవారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్లుడబ్ల్యూడబ్ల్యూ.బిఆర్ఎఒయుఆన్‌లైన్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ సర్టిఫికేట్లను సహాయ కేంద్రంలో వెరిఫై చేయించుకొని దరఖాస్తు కాపీను, ఇంటర్ /పాలిటెక్నిక్/ ఐటీఐ/ఓపెన్ ఇంటర్, 10వ తరగతి మార్కుల జాబితా, క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు ప్రతులను సమర్పించాల్సి ఉంటుందన్నారు. రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు జూలై 31లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు సహాయ కేంద్రంలో నేరుగా లేదా సెల్ నంబర్ 7382929762కు సంప్రదించాలన్నారు.

## జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**- ఎంపీపీ ఈరన్న**


ఎంపీపీ ఈరన్న

**అమరాపురం.జూన్ 30,ప్రభాతవార్త:** మండలంలో ఈ నెల 1వ తేది నుండి 28వ తేది వరకు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమం సచివాలయ పరిధిలో రెండు టిములుగా ఏర్పడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈరన్న తెలిపారు. 1 నందు ఎంపిడిఓ మునిస్వామి, విఆర్ఓ కీర్తిరాజు, 2 నందు తహశీల్దార్ గురుబ్రహ్మ, గ్రామ కార్యదర్శి ఈరన్నలు ఉంటారని ఆయన తెలిపారు. టీమ్ ఒకటి ద్వారా జరిగే కార్యక్రమాలు జూలై 1వ తేది ఆలదపల్లి, 4న మద్దనకుంట, 6న వలస, 11న అమరాపురం-1, 15న తలుపూరు-1, 20న హెమావతి, 25న తమదేపల్లి, 28న బసవనపల్లి గ్రామాల్లో గ్రామ జభలు నిర్వహిస్తారు. 2వ టీమ్ 1వ తేదిన ఆగ్రహారం, 4న నిద్రగట్ట, 6న కె.శివరం, 13న అమరాపురం-2, 18న హాలుకూరు, 22న హెమావతి-2, 27న తమదేపల్లి-2 సచివాలయ పరిధిలో గ్రామ సభలు జరుగుతాయని ఎంపీపీ తెలిపారు. గ్రామ కార్యదర్శులు సంబందిత వాలంటీర్ల ప్రజలకు కావలసిన వివిధ సర్టిఫికెట్ల సమస్యలను తెలుసుకోని అధికారుల దృష్టికి తీసుకోని వచ్చి పరిష్కదించాలని ఆయన కొరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఆమలు చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం విఆర్ఓలకు, గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

## శాకాంబరిదేవి అలంకారం


అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

**గుత్తి, జూన్ 30 ప్రభాతవార్త** పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ఆషాడమాసం సందర్భంగా శుద్ధద్వాదశిని పురస్కరించుకుని అమ్మవారిని శాకాంబరిదేవి అలంకారం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల్లో వర్షాలు కురిసి చెరువులు నిండి ప్రజలు సుభిక్షంగా వుండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, తదితర పూజలు వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం నాయకులు శ్రీకాంత్, కిషోర్, ఉమాదేవి, భాగ్యలక్ష్మి, సుకన్య, వెంకటేషులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక సమావేశం

**అమరాపురం, జూన్ 30, ప్రభాతవార్త:** మండల పరిధిలో ఆలదపల్లి, వి.ఆగ్రహారం గ్రామాలలో సచివాలయాల నందు శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మెరకు జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మునిస్వామి తెలిపారు. ఈ సమావేశం ద్వారా అర్హత కలిగిన అబ్దిదారులకు సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి స్థానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## వైద్యుల సేవలు అనన్యమైనవి


సన్మాణం చేస్తున్న దృశ్యం

**ధర్మవరం, జూన్ 30, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దిదిపు ఐదు సంవత్సరాల వరకు వైద్యులుగా పట్టణ ప్రజలకు సేవలు అందించడం అననకయమైనదని ప్రభుత్వ ఆసుపత్రి ఎఫ్ఎసి సూపరిటెంట్ డాక్టర్ నజీర్ పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగైదు సంవత్సరాలు పాటు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించడం, మంచి గుర్తింపు తెచ్చుకోవడం సంతోషదాయకమన్నారు. వైద్యులు జయప్రకాష్‌రెడ్డి, ఉమాదేవి సాధారణ బదిలీపై కృష్ణాజిల్లా నందిగామకు, డాక్టర్ మాధవి చెన్నేకొత్తపల్లికి, డాక్టర్ ఇందురేఖ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజికి పదోన్నతిపై బదిలి కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సమావేశపు కార్యలయంలో బదిలిపై వెల్లిన వీరందరికీ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వైద్యుడు తన సేవలను సేవాభావంతో రోగులకు అంకితం చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన వైద్యులను ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ నజీర్‌తో పాటు సివిల్ సర్జన్ డాక్టర్ పద్మలత, వైద్యులు సురేఖ, నివేదిత, వైష్ణవి, కిరణ్, బాలజి, ఉదయ్ కుమార్, నర్సింగ్ స్టూడెంట్ రమాదేవి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఘనంగా శాల్వాలతో సత్కరించారు.

## వైయస్సార్ ఉచిత పంటల భీమా జాబితను చూసుకోండి


వ్యవసాయధికారి మంజునాథ్

**అమరాపురం.జూన్ 30, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో 2022-2023 సంవత్సరంకు గాను ఖరీఫ్ సిజన్‌కు సంబంధించిన వైయస్సార్ ఉచిత పంటల భీమాను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ తులిపారు. సామాజిక తనఖిలో భాగంగా ప్రొవిజనల్ రైతుల జాబితాను ఆర్‌బికేలలో రైతుల యేక్క వివరాలను ప్రకటించడం జరిగిందని, కావున మండలంలోని రైతులు పంటనమోదు చేసుకొన్న వారు జాబితాలో తమ పేర్లను చూసుకోవాలని ఆయన కోరారు.

## ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు


వారపు సంత దృశ్యం

**అమరాపురం జూన్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జరిగిన వారపు సంత యందు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో సమాన్య, మధ్య తరగతి కుటుంబాలు మరియు నిరు పేద కూలీలు తీవ్ర ఆవేధన వ్యక్తం చేశారు. కెజి టమోటా 100, వంకాయలు 60, మిరపకాయలు 120, బెండకాయ 80, బంగాలదుంప 40, ముల్లంగి 60, బీన్స్ 80, క్యారెట్ 80 రూపయల వంతున వారపు సంతలో కూరగాయల ధరలు ఉండడంతో సమాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## సజావుగా మున్సిపల్ సమావేశం

**గుత్తి, జూన్ 30 ప్రభాతవార్త :** గత సమావేశాలకు భిన్నంగా కొద్దిపాటి కౌన్సిలర్ల ఆరోపణల మినహా మున్సిపల్ సమావేశం సజావుగా సాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన కౌన్సిల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు కమీషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ శనివారం నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే అజెండాతో ఈ కార్య క్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలో ఎలాంటి సమస్యలు లేకుండానే ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


కమీషనర్ ప్రసంగిస్తున్న దృశ్యం

05ATP30_05ATP30.qxd 01-07-2023 AM 12:07 Page 1



# కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

## - కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్

కదిరి టౌన్, జూన్ 30, ప్రభాతవార్త : మున్సిపాలిటీలో పనులు చేయని కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెట్టాలని మున్సిపల్ వైస్ ఛైర్మెన్‌లు గంగాదేవి, అజ్జుకుంట రాజశేఖర్‌రెడ్డి, కిన్నెర కళ్యాణ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజిమున్నిసా సాదిక్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది, ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ మాట్లాడుతూ తన వార్డులో ప్యాచ్ వర్కులు వేయాలని ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేపి అజెండాలో చేర్చాలని కోరుతున్నప్పటికి అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఆదాయం వచ్చే పనులు, బిల్లుల చెల్లింపుల విషయంలో ఆఘమేఘాలపై అజెండాలో చేర్చి బిల్లులు పాస్ చేసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇందుకు మున్సిపల్ కమీషనర్ శ్రీహరిబాబు స్పందిస్తూ ఇది వరకే 7వ వార్డులో పలు పనులు పూర్తిచేశామని మరికొన్నింటికి టెండర్లు పిలిచామని కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో సమస్య ఉందన్నారు. వాస్తవానికి మున్సిపాలిటీలో కాంట్రాక్టర్ల మాఫియా నడుస్తోందని వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని వీరిని అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మూకుమ్మడిగా తెలిపారు. 26వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ బాష మాట్లాడుతూ 25, 26 వ వార్డులో పెద్దపెద్ద పాడుబడ్డ భవనాలు చెట్లు ఉన్నాయని వర్షాకాలం వస్తున్నా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

# పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

పుట్లూరు, జూన్ 30 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్షంలో వున్నప్పుడు చెప్పిన మాటలు తప్పి విద్యుత్ చార్జీలు 50 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపడానికి సిద్ధపడ్డారన్నారు. తక్కువ ధరకు కరెంట్ దొరుకుతున్నప్పటికి అధిక ధరకు మార్కెట్‌లో కరెంట్‌ను కొనుగోలు చేయడానికి పూనుకున్నాడన్నారు. ఆదాని కంపెనీలతో కుమ్మక్కై షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు స్మార్ట్ మీటర్ల టెండర్లు అప్పచెప్పడం జరిగిందన్నారు.

17 వేల కోట్ల రూపాయలు అదనంగా భారం వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడి ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలు ఆమోదించి కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచడానికి పూనుకున్నాడన్నారు. కరెంట్ చార్జీలు రెండింతలు, మూడింతలు పెరిగాయన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం అధ్యక్షులు పెద్దిరాజు, డిహెచ్ పిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పెద్దన్న, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి లక్ష్మినారాయణ, బాలు, శివ, సురేంద్ర, రాజు, చేతివృత్తి దారుల సమైక్య మండల కార్యదర్శి ఓబుళపతి, మహిళా సమైక్య మండల కార్యదర్శి శాంతకుమారి, దేవరాజు, మల్లెపూలు రమణయాదవ్, ధన, రామాంజి, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.




ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

# మోదీ హయాంలోనే దేశం అభివృద్ధి

## - బిజెపి జిల్లా అధ్యక్షుడు వజ్ర



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వజ్ర

కదిరి టౌన్, జూన్ 30, ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్రమోది హయాంలోనే భారతదేశం అభివృద్ధి చెందిందని బిజెపి సత్యసాయిజిల్లా అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వజ్ర భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనపై కరపత్రాలను పట్టణంలోని కాలేజి సర్కిల్, కుటాగుళ్ల ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. బిజెపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటి పర్యటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు డిఎల్ ఆంజనేయులు, మైనొద్దీన్, చంటి, హరినాయుడులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ, జూన్ 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం ఎలిజబెత్, ఉపాధ్యాయులు కౌశల్, ఒబీన్, మేరీ, జయలు గత 8 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీ కావడంతో శుక్రవారం వారికి బాలికల పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇక్కడ 8 సంవత్సరాలుగా విధులు నిర్వహించి అన్ని ఒడిదుడుకులను తట్టుకుని విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా ప్రతి ఏటా 10వతరగతి విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించి వారిని ప్రగతిబాటలో పయనింపచేస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందేవిధంగా సేవలు అందించారని కొనియాడారు. అదేవిధంగా ఏ ప్రాంతంలో పనిచేసినా పిల్లల భవిష్యత్తు కోసమే ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తారని తోటి సిబ్బంది వారిని అభినందించారు.

# ఓటర్ జాబితాను పకడ్బంధీగా తయారు చేయండి - తహశీల్దార్



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరెడ్డి

అమడగూరు, జూన్ 30 ప్రభాతవార్త

ఓటర్ జాబితాను పకడ్బంధీగా తయారు చేయాలని తహశీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, పోలింగ్ బూతుల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితా తయారీలో నిష్పక్షపాతంగా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వ్యవహరించాలన్నారు. జూలై 21 నుండి ఆగస్టు 21వతేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇలాంటి ఓటర్ల పరిశీలన కారక్రమాలు నిర్వహించాల్సి వుంటుందన్నారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 29వతేదీ వరకు పోలింగ్ కేంద్రాల క్రమ వర్గీకరణ ఏపి రేషియో జెండర్ రేషియో డబుల్ ఓటర్ డెత్ ఓటర్లు శాశ్వత బదిలీల ఓటర్ల తొలగింపులు ఎన్నికల కమీషన్ నిబంధన ప్రకారం పిడబ్ల్యుడి థర్డ్ జెండర్ ఓటర్లను గుర్తించాలని అందరూ ఒకే బూతులో వున్నట్లు 2024 జనవరి 1వతేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తయి వుండాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, విఆర్ఒలు మహేంద్రప్రసాద్, మోదీ బాష, నాగప్ప, హరినాథ్, 26 మంది బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

## -వామపక్ష పార్టీలు



డిఈ వినతిపత్రం అందచేస్తున్న వామపక్ష నాయకులు

కదిరి, జూన్ 30, ప్రభాతవార్త : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు బడా సుబ్బిరెడ్డి, కదిరప్ప, జిఎల్ నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మండి పడ్డారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలను పెంచారని విమర్శించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎలక్ట్రికల్ డిఈ మోసస్‌కు అందచేశారు.

## పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి - సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

ముదిగుబ్బ, జూన్ 30 ప్రభాతవార్త

ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సిపిఐ నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశదోరణి అవలంభిస్తూ సామాన్యుల నడ్డి విరిగేటట్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. ముఖ్యమంత్రి నిరంకుశ పాలనకు రాబోయే ఎన్నికల్లో చమరగీతం పాడాలని ఆయన పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసే విధంగా రాష్ట్ర నాయకులు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచడం సామాన్యునికి కష్టతరంగా వుందని కార్పోరేట్ సంస్థలకు అడిగిందలా ఇస్తూ సామాన్యుల నోటిలో మట్టి కొడుతున్నారని ఇటువంటి దురాగతాలను ప్రభుత్వం ఆపకపోతే ప్రభుత్వంపై ప్రజలు తిరిగుబాటు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

# పూర్వ ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు

నంబులపూలకుంట, జూన్ 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మండెంవారిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వైఎస్ఆర్‌టిఎఫ్ ఆధ్వర్యంలో పూర్వ ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు ఆంజినేయులు నాయక్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొని గంగాధర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డిలను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుందన్నారు. విద్యాభివృద్ధిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న నాడు-నేడు, విద్యాకానుక, గోరుముద్ద లాంటి కార్యక్రమాలతో రాష్ట్ర విద్యాభివృద్ధిని తీసుకువెళుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. బదిలీలు, పదోన్నతులు సవ్యంగా జరపడంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. విద్యా వ్యస్థలను గాడిలో పెట్టిన ఘనత విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, ఎస్ఈఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఎంఎల్‌సి కల్పలతారెడ్డిల వల్లే సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ సమస్యలపై వైఎస్ఆర్‌టిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో సామరస్యంగా చర్యలు జరిపి సమస్యలు పరిష్కరించడంలో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు శంకర్‌రెడ్డి, పూర్ణ, మదార్, అశోక్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌నాయక్, జయకుమార్‌నాయక్, బాబావలి, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌నాయక్, పురుషోత్తం, దాదాపీర్, తిరుమల ప్రసాద్. అలీ, రఫీ, ద్వారక, శీన, ఈశ్వర్, ధర్మారెడ్డి, ఉప్పు శ్రీనివాసులు, ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన డిప్యూటి ఇఒ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటి ఇఒ



విద్యాకానుక గురించి అడుగుతున్న డిప్యూటి ఇఒ

యల్లనూరు, జూన్ 30 ప్రభాతవార్త

మండలంలోని వెన్నపూసపల్లి హైస్కూల్, కస్తూరిబా గురుకుల పాఠశాల, యల్లనూరు జిల్లా పరిషత్ పాఠశాలను డిప్యూటి ఇఒ పద్మప్రియ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, తరగతి గదులను, విద్యాకానుక కిట్ల పంపిణీని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల సౌకర్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనుల నాణ్యత పరిశీలించారు. నాడు - నేడు పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడవద్దని సూచించారు. పాఠ్యాంశాల్లోని అంశాలపై విద్యార్థుల సామర్థ్యాన్ని ఉపాధ్యాయుల పనితీరును పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 పరమేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైళ్లను ఆపేలా తగు చర్యలు తీసుకోండి

## - ఎంపికి వినతి



ఎంపికి వినతిపత్రం అందచేస్తున్న రాయలచెరువు గ్రామస్తులు

యాడికి, జూన్ 30 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు రైల్వేస్టేషన్‌లో మెయిల్, ఎగ్మోర్ రైళ్లు ఆగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం ఎంపి తలారి రంగయ్యకు వినతిపత్రం అందచేశారు. కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకముందు రాయలచెరువు రైల్వేస్టేషన్‌లో పై రెండు రైళ్లు ఆగేవని, దాదాపు 70 గ్రామాల ప్రజలు ఈ రైల్వేస్టేషన్ నుండే రాకపోకలు సాగిస్తున్నారని వ్యాపారస్తులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు, రైతులకు ఈ రెండు రైళ్లు రాయలచెరువు రైల్వేస్టేషన్‌లో ఆగితే ఎంతో సౌలభ్యంతో పాటు సౌకర్యంగా వుంటుందన్నారు. దాదాపు లక్ష 10 వేల మంది ప్రజలకు ఈ స్టేషన్ కేంద్రమని, తమ వినతిని పరిశీలించి గతంలో మాదిరిగానే పై రెండు రైళ్లతో పాటు దాదర్ రైలును కూడా ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తలారి నాగేష్, తలారి శివయ్య, రషీదు, విశ్వనాథ్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్షాల ధర్నా



వినతిపత్రం అందచేస్తున్న వామపక్ష నాయకులు

యాడికి, జూన్ 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో గల విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ రాజారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బషీర్‌మహమ్మద్, పట్టణ కార్యదర్శి మాయకుంట్ల మోహన్, కార్యకర్తలు సంజీవులు, కోదండరావు, శ్రీనివాసులు, సిపిఐ పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకటరాముడు, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, వడ్డే రాముడు, శివన్న, బండారు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

# మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతికత టిడిపి లేదు

## - వైసిపి నేతల విమర్శ




మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అనంతపురం సిటీ, జూన్ 30, ప్రభాతవార్త : అధికారం కోసం 650 హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే టిడిపి వెబ్‌సైట్ నుండి మ్యానిఫెస్టోను మాయం చేసిన టిడిపి నేతలకు మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతికత లేదని వైసిపి నేతలు విమర్శించారు. జిల్లా వైకాపా కార్యలయంలో శుక్రవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి గౌస్‌భేగ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి , యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మారుతీనాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో నవరత్నాలు పథకాలను తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నవరత్నాలు పథకాలను ప్రతి యేటా క్యాలెండర్‌ను విడుదల చేసి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్నాలు పథకాలతో ప్రతి లబ్ధి చేకూరుతోందని ప్రజలంతా వైసిపితో లబ్ధి పొంది రానున్న ఎన్నికల్లో వైసిపి వెంట నడిచేందుకు రాష్ట్రంలోని 175 నియోజవకవర్గాల్లో సిద్ధంగా ఉన్నారన్నారు. తమకు భవిష్యత్తులేదన్న భయంతో టిడిపి చేస్తున్న విషప్రచారాన్ని రాష్ట్రంలో ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితులు లేవని వార పేర్కొన్నారు. ఇప్పటికైనా టిడిపి నేతలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

# భగ్గుమంటున్న కూరగాయల ధరలు

## - కిలో మిర్చీ రూ.120, టమోటా రూ.100



కూరగాయలు

యల్లనూరు, జూన్ 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలో శుక్రవారం సంతలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ధరలపై ప్రభావం చూపుతోంది. జూన్ నెల ముగిసినప్పటికి ఎండ తీవ్రత తగ్గకపోవడంతో మరో వైపు ఇక్కడికి అవసరాలు సరిపడు కూరగాయలు ఉత్పత్తి లేక దూర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ఈ పరిస్థితి నెల కొంది. వారం రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం సంతలో కిలో మిర్చీ 120 రూపాయలు, టమోటా 100, మిగిలిన కూరగాయలు 40 రూపాయలుపైనే వున్నాయి. రోజురోజుకు ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనుగోలు చేయాలంటేనే ఆందోళన చెందుతున్నారు.

# లంగ్స్, లివర్ సమస్యతో బాధపడుతున్న వాలంటీర్‌కు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జూన్ 30 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని 25వ వార్డు సచివాలయం పరిధి లో వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్ లంగ్స్, లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. శ్రీనాథ్ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం 25వవార్డు సచివాలయం కన్వీనర్ మనోజ్‌కాశి తనవంతుగా 5 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సచివాలయం సెక్రటరీలు, వాలంటీర్ల ఎంఎల్‌ఒ సమక్షంలో అందచేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తనకు ఆర్థిక సాయం చేయాలని శ్రీనాథ్ కోరుతున్నాడు.

# పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి-సిపిఐ



సబ్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ శ్రేణులు

ఓబుళదేవరచెరువు, జూన్ 30, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం వివిధ పన్నుల రూపంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి చలపతి, రైతు సంఘం నాయకులు పూల శ్రీనివాసులు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. ఓవైపు నిత్యావసర ధరలు అకాశాన్ని అంటుతుండగా మరో వైపు విద్యుత్ చార్జీల పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ట్రూఆఫ్ పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసహరించుకోవాలన్నారు. లేకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్, మహిళా సమైక్య నాయకురాలు రత్నాబాయ్, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామచంద్ర, రమణ, రవి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

